

ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



కాగజ్‌నగర్ దోబీఘాట్‌లో.. సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రజక సంఘం నాయకులు

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ముందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. జిల్లాలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రజక కూలీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధిశాఖ అధికారి సజీవన్, సింగిల్ విండో అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కడతల మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రూప్‌నార్ రమేశ్, వైగాడే మారుతి, వేములవాడ గణపతి, రుని సంతోష్, కడతల రమేశ్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో 1న జాబ్ మేళా

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించే మినీ జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1న జిల్లా కేంద్రం పాత కలెక్టరేట్ భవనంలోని టాస్క్ కార్యాలయంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసి 30సంవత్సరాల లోపు వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

అటకెక్కిన ఆహార పట్టిక!


చక్కని విద్యతోపాటు కడుపు నిండా భోజనం అందుతుందనే ఉద్దేశంతో తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్చుతుంటారు తల్లిదండ్రులు. అయితే ఆహార పట్టిక సరిగ్గా అమలుకాక పిల్లల చదువుపై ప్రభావం పడుతోంది. గుత్తేదారులు సరకులు సక్రమంగా సరఫరా చేయకపోవడమే కారణం. ఉమ్మడి జిల్లాలోని గిరిజన వసతిగృహాల్లో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

ఈనాడు, ఆసిఫాబాద్

గిరిజన వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆహార పట్టిక ప్రకారం గుడ్లు, పాలు, చికెన్, రాగిజావ, అరటి పండ్లు అందించాలి. వీటి కోసం ఏటా టెండర్లు నిర్వహిస్తారు. గుత్తేదారులు బిల్లులు రావడం లేదంటూ చేతులెత్తేస్తున్నారు. రాకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులే (హెచ్‌ఎం) సరకులు సమకూర్చుకోవాలని అధికారులు చెబుతున్నా.. ఆర్థిక భారమని వీరూ పట్టించుకోవడం లేదు. విద్యార్థులకు కేవలం పప్పు లేదా ఒక కూరతో సరిపెడుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో అంతంతమాత్రంగానే మెనూ అమలవుతోంది. పెండింగ్ బిల్లులు విడుదల చేసి, విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



వాంకిడి గిరిజన వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



తెచ్చి పెడుతున్నా నిత్యం రూ. 10-20 వేలు ఖర్చు పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాల పరిధిలో రూ. 1.50 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. పదుల సంఖ్యలో వసతిగృహాలకు నాలుగు నెలల నుంచి వీటి సరఫరా ఊసేలేకపోవడం గిరిజన సంక్షేమాధికారుల పనితీరును తేటతెల్లం చేస్తోంది.

పప్పన్నంతో సరి

విద్యార్థులకు నిత్యం ఉదయం పాలు, రాగిమాల్ట్ ఇవ్వాలి. వారంలో నాలుగు రోజులు గుడ్లు, నాలుగు రోజులు అరటిపండ్లు, ఒకసారి చికెన్ వండి పెట్టాల్సి ఉంటుంది. నిత్యం వివిధ కూరగాయలతో చేసిన కూర, పప్పు, అన్నం అందించాలి. ఉమ్మడి జిల్లాలో ఆహార పట్టిక (మెనూ) ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం పప్పు, అన్నంతోనే విద్యార్థులు సరిపెట్టుకుంటున్నారు.



పప్పుతోనే విద్యార్థులకు భోజనం

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 530 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ కోడిగుడ్ల సరఫరా లేక పప్పుతోనే సరిపెడుతున్నారు. మండలంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు గుడ్లు, అరటిపండ్లు రావడం లేదు.

ఏళ్లుగా ఇద్దరికే టెండర్!

ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఐటీడీఏ అధికారులు సరకుల సరఫరా కోసం టెండర్లు నిర్వహిస్తుంటారు. కొన్నేళ్లుగా ఆదిలాబాద్, ఉట్నూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే టెండర్ వస్తుండటం గమనార్హం. అంతర్జాలంలో అంతా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నా..

- వసతిగృహాలకు సరఫరా కాని సరకులు
- విద్యార్థులకు అందని పోషకాహారం

ఏళ్ల తరబడి వీరిద్దరికే ఎలా టెండర్ దక్కుతుందనేది అంతుపట్టని విషయం. పోనీ సరకులు సక్రమంగా సరఫరా చేస్తారా అంటే అదీ ఉండటం లేదు. మరోవైపు కొత్త వారు టెండర్లు వేయకుండా, వారికి అవకాశం రాకుండా చేస్తున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి.

రూ.1.50 కోట్ల బిల్లుల పెండింగ్!

జూన్ నుంచి కొంత కాలంపాటు పాలు, చికెన్, గుడ్లు, అరటిపండ్లు సరఫరా చేసిన గుత్తేదారులు.. నెల రోజుల నుంచి అనేక వసతిగృహాలకు అందించడం లేదని సమాచారం. కొన్నిచోట్ల ప్రధానోపాధ్యాయులు

పర్యవేక్షిస్తాం - రమాదేవి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి

గుత్తేదారులు సరకులు సరఫరా చేయలేకపోతే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వీటిని తెప్పించాలి. వీరికి బిల్లులు చెల్లిస్తాం. ఆహారపట్టిక తప్పనిసరిగా గిరిజన ఆశ్రమ వసతిగృహాల్లో అమలు చేసేలా పర్యవేక్షిస్తాం.



తలపడుతున్న మహిళా క్రీడాకారిణి

ఉత్సాహంగా జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

కౌటాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 బాల, బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 27 బాలుర, 21 బాలికల జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. బాలికల కబడ్డీ ఫైనల్‌లో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ జూనియర్ కళాశాల మొదటి స్థానంలో, రెబ్బెన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో కాగజ్‌నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం, కౌటాల మండలం మొగడ్‌ధగడ్ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లను మండల విద్యాధికారి గావుడె హన్మంతు అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : నేషనల్ మీన్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఫీజు చెల్లించే గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి ఎం.ఉదయ్‌బాబు గురువారం ప్రకటించారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కూరగాయల సాగులో మార్పులు అవసరం

వాంకిడి, న్యూస్‌టుడే: కూరగాయలు పండించే విధానంలో మార్పులు చేపట్టాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో గిరిజన ఉపప్రణాళికలో భాగంగా.. సమీకృత పంట నిర్వహణ, మామిడి, ఇతర ఉద్యానవన పంటల రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూరగాయ పంటలు మొత్తం ఒకేసారి వేయకుండా రెండు లేదా మూడు విడతలుగా వారం నుంచి పది రోజుల అంతరం ఇస్తూ పండించాలని సూచించారు. పంటల్లో ఆకుముడత, కాయతొలుచు



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

పురుగు నివారణకు పిచికారీ చేసే మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోపీకాంత్, వ్యవసాయ విస్తరణాధికారులు రాజేశ్వర్, శంకర్, తాండవకృష్ణ, మానస, పరిమళ, వెంకటేశ్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అన్నదాతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

కౌటాల, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో రాణించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహించిన బాలురు,



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బాలికల జిల్లాస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, నానయ్య, మండల విద్యాధికారి హన్మంతు, కౌటాల జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నారాయణ సింగ్, నాయకులు రవీందర్‌గౌడ్, ఉమామహేష్, పసునూరి తిరుపతి, డబ్బ గోపాల్, గట్టయ్య, బాపు తదితరులు పాల్గొన్నారు.

వరి పెరిగే.. పత్తి తగ్గే!


- గత సీజన్ కంటే తగ్గిన పంటల సాగు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

వానాకాలం సీజన్‌కు సంబంధించి వివిధ రకాల పంటల సాగు వివరాలను వ్యవసాయ అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ సారి జిల్లాలో వరి సాగు పెరగగా.. పప్పు దినుసులు, పత్తి సాగు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది వానకాలంతో పోలిస్తే వివిధ రకాల పంటల సాగు 15 వేల ఎకరాల వరకు తగ్గినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర, ఎగువ ప్రాంతంలో కురిసిన అధిక వర్షాలతో జిల్లాలోని ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతాల్లో వచ్చిన వరదలతో భూములు నీట మునగడంతో.. పంటల తగ్గుదలపై ప్రభావాన్ని చూపినట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఈ సారి అన్ని రకాల పంటలు 4.40 లక్షల ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కానీ క్షేత్ర స్థాయిలో నిర్వహించిన పంటల నమోదు కార్యక్రమంలో 4.23 లక్షల ఎకరాల్లో సాగైనట్లు గుర్తించారు. వీటిని ఏఈవోలు అంతర్జాలం ద్వారా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 3.30 లక్షల ఎకరాలకు సంబంధించి వివరాలు నమోదు చేశారు. ఈ సారి సన్నరకం వరికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో.. కిందటి వానకాలంతో పోలిస్తే ఈ సారి 1800 ఎకరాల్లో సాగు పెరిగింది.

జిల్లాలో..
గత వర్షాకాలంలో అన్ని రకాల పంటల సాగు : 4,39,251 ఎకరాలు
ఈ వానాకాలంలో : 4,23,182 ఎకరాలు





వరి సాగు

పప్పు దినుసులదీ అదే తీరు..

ఓ వైపు విపణిలో పప్పుల ధరలు మండిపోతున్నాయి. వాటి సాగు మాత్రం జిల్లాలో తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. గత వానకాలంలో కంది, పెసర పంటలు 41 వేలకు పైగా ఎకరాల్లో సాగు చేయగా.. ఈ సారి 32 వేలకే పరిమితం అయింది. మద్దతు ధర ఉన్నా.. సరైన మార్కెటింగ్ వసతి సదుపాయం లేకపోవడం, రైతుల వద్ద ఉన్నప్పుడు ధర తక్కువగా ఉండి వారు విక్రయించాక పెరగడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. సోయా సైతం కిందటి సారి 8,875 ఎకరాల్లో సాగు కాగా ఈ సారి 6,300 ఎకరాల్లోనే వేశారు. పెసర, సోయా మూడు-మూడున్నర నెలల మధ్య పంట చేతికొస్తుంది. ఆ పంటలు చేతికొచ్చే సమయంలోనే భారీ వానలు పడుతుండటంతో.. దెబ్బతింటున్నాయని భావించి రైతులు వాటి సాగును తగ్గించినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

భారీ వర్షాలు, చీడపీడల బెడదతో..

జిల్లాలో కొన్నేళ్లుగా వాణిజ్య పత్తి పంటనే మెజారిటీ రైతులు సాగు చేస్తున్నారు. పత్తికి ధర ఎక్కువగా ఉండటం, ఎకరాకు 8-10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండటంతో.. దీనికే ఎక్కువ మొగ్గు చూపేవారు. దీంతోపాటు అంతర పంటగా కంది సాగు చేస్తారు. అయితే భారీ వర్షాలు, చీడపీడల ఉధృతి పెరగడం, నకిలీ విత్తనాల బెడద, కోతల సమయంలో కూలీల కొరత, తదితర కారణాలతో ఈ సారి కాస్త తగ్గినట్లు స్పష్టమవుతోంది. గత వర్షాకాలంలో 3,29,971 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఈ సారి 3,26,318 ఎకరాల్లో సాగైనట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే 3,653 ఎకరాల్లో సాగు తగ్గినట్లు స్పష్టం అవుతోంది. దాని స్థానంలో కొందరు రైతులు వరి, ఇతర పంటల సాగుచేశారు.



నాణ్యతాలోపం.. ఇదిగో సాక్ష్యం!

అధికారుల నిర్లక్ష్య ధోరణి, పర్యవేక్షణ లోపం కారణంగా ఏళ్ల కాలం పాటు మన్నికగా ఉండాల్సిన నిర్మాణాలు కట్టిన కొన్ని రోజులకే కూలిపోతున్నాయి. మండలంలోని ఖైరి ఎంపీపీఎస్ పాఠశాల మన ఊరు-మన బడిలో పథకంలో ఎంపికైంది. ఈ మేరకు ఇక్కడ అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. నాసిరకం పనులు చేపట్టడంతో.. పాఠశాల వెనుక వైపు నిర్మించిన ప్రహరీ కట్టిన ఏడాదికే కూలిపోయింది. దీంతో పశువులు, ఇతర జంతువులు పాఠశాల లోపలికి రాకుండా తాత్కాలికంగా పాలిథీన్ కవర్లను అడ్డంగా పెట్టారు. **- కెరమెరి, న్యూస్‌టుడే**

కొండచిలువ కలకలం



సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మండలంలోని బెస్తవాడ కాలనీలో చెత్తాచెదారం కొన్ని రోజులుగా పేరుకుపోయి విషపురుగులు వస్తున్నాయని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. గురువారం రాత్రి చెత్త నుంచి కొండచిలువ రహదారిపైకి రావడంతో భయంతో పరుగులు తీశారు. అనంతరం అది వాహనాల కిందపడి చనిపోయింది. సుమారు అయిదు అడుగుల పొడవు వరకు ఉంటుందని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



శిబిరంలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో తుకారం భట్, పాల్గొన్న భాజపా నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్

రౌట సంకెపల్లిలో మెగా వైద్యశిబిరం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మండలంలోని గిరిజన గ్రామం రౌట సంకెపల్లి (ఆర్‌ఎస్ పల్లి)లో ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని.. . భాజపా నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొనగా.. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి తుకారాం భట్ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది రోగులను పరీక్షించి చికిత్సలు చేశారు. రౌట సంకెపల్లి పంచాయతీ ప్రజలందరూ చికిత్సలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో, డీఆర్‌డీవో అడె దత్తు, వైద్యుడు వినోద్‌కుమార్‌ను, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవలను సన్మానించారు.

ఎంబీబీఎస్ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఆసిఫాబాద్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపల్ డా.సతీష్‌కుమార్ గురువారం ప్రకటించారు. పరీక్షలకు 99 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు డిస్టింక్షన్ సాధించారన్నారు. 25మంది ప్రథమ శ్రేణిలో, 61మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని వివరించారు.

పల్లెలకు నిధులు

- ట్రాక్టర్ అప్పు కిస్తీలు, కార్మికుల వేతనాలు చెల్లింపునకు విడుదల

న్యూస్‌టుడే, నిర్మల్

ఇన్నాళ్లూ నిధుల లేమితో ట్రాక్టర్ కిస్తీలు, కరెంటు బిల్లులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లింపులు లేక, పనులు సాగక పల్లెల్లో పాలన పడకేసింది. పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా మారుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కాలువల్లో ఉన్న మురుగును ఎత్తిపారేస్తూ.. రోడ్లన్నీ శుభ్రం చేస్తూ.. ఇంటింటా చెత్తను సేకరిస్తూ.. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతూ పచ్చదనం కోసం పరితపిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులు దూరం చేయడానికి, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు విడుదల చేసింది.

కార్యదర్శులపై భారం పడకుండా..

ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు సర్పంచులు పాలకవర్గాలకు బాధ్యత వహించారు. పల్లెల్లో ఏ పని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునే వారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ. వేలల్లో ఖర్చు చేశారు. మరికొందరు వారి వేతనాలు విడుదల కాగానే అందులోంచి వెచ్చించారు కూడా. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకులకు సింగిల్‌ఫేస్ మోటార్లు అమర్చడం వంటి పనులు కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నా నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు సైతం ఆవేదన చెందుతూ వచ్చారు. ఎట్టకేలకు ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులు, ఇతర అభివృద్ధి పనులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయడంలో కార్యదర్శులపై ఆర్థిక భారం నుంచి బయటపడ్డారు. అసలే వర్షాకాలం. . వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరుతున్నారు.



జిల్లా	ట్రాక్టర్ కిస్తీలు చెల్లించని పల్లెలు	పారిశుద్ధ్య కార్మికులు	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
నిర్మల్	72	1,624	4.63
ఆదిలాబాద్	254	1,505	5.05
మంచిర్యాల	55	1,092	3.49
కుమురంభీం	50	1,203	3.34



మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

అప్రమత్తతే.. పిడుగుపాటు నుంచి రక్షణ!

● ఇటీవల వరుస మరణాలు

కెరమెరి, ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే:

ఏటా వానకాలంలో పిడుగుపాట్లకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మనుషులు, జీవాలు మృత్యువాతపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వానకాలం చివరి దశలో ఉన్న ఈ సమయంలో వరుస మరణాలు ఆందోళనకు కారణమవుతోంది. సాంకేతికత ఉపయోగించి ప్రజలకు ముఖ్యంగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అడవుల జిల్లాగా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్‌లో సాధారణంగా ఎత్తైన ప్రాంతాలు, చెట్లు ఎక్కువగా ఉండడంతో వర్షపాతం అధికంగా ఉంటుంది. దీనికితోడు పిడుగుల సమస్య కూడా ఎక్కువే.

ఇటీవల ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనలు

కళ్లెదుటే భర్త మృత్యువాత

గత నెల 18న పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్.. భార్య కాంత కూలీలతో వరి పొలంలో ఎరువులు వేస్తుండగా భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. కాంతకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

* ఈ నెల 21న కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో ఎద్దుపై పిడుగుపడి మృతి చెందింది. సమీపంలో ఉన్న తార్రె గోవిందు, నీలాబాయి దంపతులు పిడుగుపాటుకు గురై గాయాలపాలయ్యారు.

* ఈ నెల 22న మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన గోలెం పోషక్క తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా.. పిడుగుపడి మృతిచెందింది.

* ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన రాఠోడ్ అవినాష్. తన చేనులో పశువుల కోసం గడ్డి కోస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

పిడుగు అంటే..

వానలు పడే సమయంలో మబ్బుల నుంచి అత్యంత శక్తివంతమైన విద్యుత్తు విడుదల అవుతుంది. అది భూమికి చేరినపుడు దాన్ని పిడుగు అంటారు. ఆ సమయంలో భారీ ఉరుములు, మెరుపులు వస్తాయి. పిడుగుతో చనిపోయిన ప్రతి పది మందిలో ఆరుగురు చెట్ల కింద నిలబడిన వారే.

ముందుగా తెలుసుకోవడం ఎలా?



పిడుగుల నుంచి ముందే హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం **'దామిని'** యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. రానున్న 15 నిమిషాల్లో మనం ఉండే ప్రదేశంలో పిడుగు పడుతుందో లేదో దీని ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర భూ విజ్ఞానశాఖ కింద పనిచేసే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ 2020లో ఈ యాప్ రూపొందించారు. వ్యక్తుల జీపీఎస్ లొకేషన్ ఆధారంగా 20-30 కి.మీ. పరిధిలో పిడుగుల నుంచి యాప్ ముందుగానే హెచ్చరిస్తుంది. ప్లేస్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మోహన్‌దాస్ తెలిపారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే..

● పంట చేన్లలో పనిచేసే సమయంలో వర్షం పడితే రైతులు ఏదో ఒక చెట్టు కిందికి వెళ్తుంటారు. గాలి, ఉరుములు, మెరుపులు ఉంటే పిడుగులు పడేందుకు అవకాశం ఎక్కువ.

● సాధారణంగా ఎత్తైన ప్రాంతాల్లో లేదా చెట్లపై ఎక్కువగా పడే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో ఉండకూడదు.

● కేబుల్ టీవీ, కంప్యూటర్లు వంటి విద్యుత్తు ఉపకరణాలు ఆపేసి కనెక్షన్లు తొలగించాలి.

● విద్యుత్తును గ్రహించే వస్తువులకు దూరంగా ఉండాలి. నేల మీద నిటారుగా నిల్చొని ఉండొద్దు. భూమిపై పడుకోవాలి లేదా కూర్చోవాలి.

● పిడుగుపాటుకు గురైన వ్యక్తి స్పృహ కోల్పోతాడు. ఇలాంటి వారికి ప్రాథమిక చికిత్స చేయడం కూడా కష్టం. బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించాలి

● ఈ సమయంలో చరవాణి వాడకూడదు.

నష్టపరిహారం ఉంది..




పిడుగుపాటుతో మృతి చెందితే కేంద్ర ప్రభుత్వం రూ.4 లక్షల నష్టపరిహారం ఇస్తుంది. గత భారాస ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ జీఓకు అదనంగా మరో రూ.2 లక్షలు కలిపి రూ.6 లక్షలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. రైతుబీమా పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఎవరైనా పిడుగుపాటుతో చనిపోతే దీని కింద రూ.5 లక్షలు మంజూరు చేశారు. కానీ భూములు లేని వారిని పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లా మొత్తంలో ఇప్పటి వరకు 42 మందికి పైగా పిడుగుపాటుకు గురై మృతి చెందినా పరిహారం రాని పరిస్థితి. జీఓను సవరించి, కేంద్ర నుంచి వచ్చే పరిహారం కోసం ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు బి.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

- సుమిత్ర బాయి, కెరమెరి



ఇద్దరు పిల్లలతో కనిపిస్తున్న ఈమె చౌదరి సుమిత్ర బాయి. భర్త చౌదరి రమేష్ ఆగస్టు 16న వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఇద్దరు చిన్నారులతో ఒంటరిగా మిగిలారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో జీవితం అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.



పర్యాటకం.. మెరుగుపరిస్తే ప్రయోజనం

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, కడెం:

సహజసిద్ధమైన అందాలతో ఆకట్టుకునే కడెం జలాశయానికి నాలుగేళ్లుగా సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఎత్తైన సహ్యాద్రి కొండలను ఆనుకుని కనువిందు చేసే సుందర దృశ్యాలను ఇముడ్చుకుని ఉన్న కడెం పర్యాటకులకు మానసికోల్లాసాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదు. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులకు సరైన సదుపాయాలు లేక, ప్రశాంత వాతావరణంలో కొద్దిసేపు సేద తీరుదామంటే వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. సందర్శకులు జలాశయంలో విహరించేందుకు పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన పడవల్లో స్పీడ్ బోటు మోటారు చెడిపోవడంతో దాన్ని పక్కన పడేశారు. పెద్ద బోటులోకి ఎక్కేందుకు ఉపకరించే స్టాండు(జెట్టి) పక్కలకు రక్షణ లేక ప్రమాదకరంగా ఉంది. ఈ బోట్లను మార్చి కొత్త పడవలు, స్టాండు తెప్పిస్తామన్న అధికారులు, నేతల మాటలు కార్యరూపం దాల్చడం లేదు. జలాశయం నీటిలో పెద్దలు, పిల్లలకు కావల్సిన ఆట పరికరాలనూ ఏర్పాటు చేస్తే మేలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

లీజుకు హరిత రిసార్టులు



మూసి ఉన్న హరిత రిసార్టు

కడెంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే హరిత రిసార్టులో ఉన్న విడిది గదుల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు సేద తీరేవారు. వచ్చిపోయే వారికి భోజనం అందించే అవకాశం ఉండేది. అయితే ఈ రిసార్టును బృందావన్ గార్డెన్స్ వారు ఇటీవల లీజుకు తీసుకున్నారు. దీనిని మెరుగుపరిచి మరింత చక్కటి ఆతిథ్యం ఇచ్చేలా హోటల్, విడిది గదులను తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి పనులు చేపడుతున్నారు. కడెం వచ్చే సందర్శకులకు మానసిక ఉల్లాసాన్నిచ్చేలా రిసార్టును అభివృద్ధి చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే రెండు నెలలుగా ఈ రిసార్టు మూసి ఉందని.. త్వరగా విడిది గదులను మెరుగుపరిచి అందుబాటులోకి తేవాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో సంచలనం సృష్టించిన యూబిట్ కాయిన్ మల్టీలెవల్ మార్కెటింగ్‌లో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశామని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. కడెం మండలం కన్నాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి రమేశ్, కుభీరు మండలం దౌజినాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కీరం వెంకటేశ్‌గౌడ్‌లను పోలీసుల రిమాండ్ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

కేంద్ర మంత్రులతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ




కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ దిల్లీలో గురువారం కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఆయా సమస్యలను ప్రస్తావించారు. తొలుత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి జిల్లా కేంద్రంలో ఎయిర్‌ఫోర్సు ఏర్పాటు గురించి విన్నవించారు. రక్షణ శాఖకు ఇక్కడ 369 ఎకరాల భూమి ఉందని, అదనంగా 1592 ఎకరాల సేకరణకు జిల్లా అధికారులు భూమిని గుర్తించారని వివరించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పడంతో త్వరలో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారని ఎంపీ తెలిపారు. అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి మూతపడ్డ సీసీఐను తెరిపించాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మంత్రి తమ ముందే మాట్లాడారన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారని వెల్లడించారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్యను కలిసి ఇటీవల జరిగిన జైనూర్ ఘటన పూర్వాపరాలను వివరించినట్లు తెలిపారు. ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరినట్లు వివరించారు.

సిరికొండలో సామాజిక బహిష్కరణ

ఈటీవీ - ఆదిలాబాద్ : పగలు పట్టింపులు మానవత్వాన్ని మరిచిపోయేలా కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించిన ఘటన ఒకటి ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో నివాసముండే దగ్గరి బంధువుల మధ్య ఒకప్పుడు ఎంతో సఖ్యత ఉండేది. అంతా దగ్గరి బంధువులే కావటంతో అవసరాల రీత్యా ఓ కుటుంబం రూ.2 లక్షలు అప్పు తీసుకొంది. తిరిగి చెల్లించడంలో జాప్యం కావటంతో మనస్పర్థలకు దారితీసింది. మాటామాటా పెరిగి కుటుంబాల మధ్య కలహానికి దారితీసింది. విషయం కుల పెద్దల పంచాయతీ వరకు వెళ్లింది. తీసుకున్న అప్పు తీర్చినా మనస్పర్థలు తొలగిపోలేదు. ఆలస్యంగా అప్పు చెల్లించిన కుటుంబాన్ని బహిష్కరించాలని సమీప బంధువులే నిర్ణయించారు. మిగిలిన బంధువులు కూడా వారి ఇంటికెళ్లొద్దని నిర్ణయించారు. బహిష్కరణకు గురైన బాధితుల కుటుంబంలో ఇటీవల ఓ పెద్దాయన కాలం చేశారు. సమీప బంధువులెవరూ రాలేదు. పాడెను ఎత్తుకోలేదు. మిగిలిన కుల, సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు సహకరించి అంత్యక్రియలు పూర్తిచేశారు. బంధువులంతా ఉండి అనాథలయ్యామంటూ బాధితుల్లో ఒకరు కన్నీరుమున్నీరుగా విలపించారు.



ఉద్యమాల ఊపిరి.. కొండా లక్ష్మణ్ బాపూజీ

● నేడు జయంతి

న్యూస్‌టుడే, వాంకిడి

స్వాతంత్రోద్యమం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ విముక్తి పోరాటం.. మూడు దశల ఉద్యమాల్లో పిడికిలెత్తి ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన అలుపెరగని వీరుడు కొండాలక్ష్మణ్ బాపూజీ. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ లక్ష్యం చేరుకున్న సమయంలో దశాబ్దాల కల సాకారమైన వేళ స్వప్నాన్ని కళ్లారా చూడలేకపోయారు. ఓవైపు ఉద్యమాలే కాకుండా ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ప్రజాసేవలో రాణించారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేకం కథనం.

కుమురం భీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో 1915 సెప్టెంబరు 27న అమ్మక్క-బాపూజీలకు నాలుగో సంతానంగా కొండా లక్ష్మణ్ జన్మించారు. న్యాయవాద విద్యనభ్యసించిన ఆయన నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1967, 1972లో భువనగిరి నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1957-60 వరకు రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, ముఖ్యమంత్రి సంజీవయ్య క్యాబినెట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి క్యాబినేట్‌లో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.



వాంకిడి వీధుల్లో ప్రజలతో బాపూజీ (పాత చిత్రం)

మలిదశలో ఉద్యమంలో..

2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌తో మాట్లాడి ప్రోత్సహించడమే కాదు. సచివాలయం ఎదురుగా ఉన్న తన నివాసం జలదృశ్యాన్ని తెరాస ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఆ వేదికగానే తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) ఆవిర్భవించింది. అప్పటి నుంచి బాపూజీ అశోక్‌నగర్‌లోని అద్దె ఇంట్లో నివాసమున్నారు. తెలంగాణ సమరయోధులతో ఇందిరాపార్కు వద్ద, ఆ తర్వాత దిల్లీలోని జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ఎర్రటి ఎండలో తెలంగాణ రాష్ట్రమంతటా బస్సు యాత్ర చేపట్టారు. తెలంగాణ ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. 97ఏళ్ల వయసులో 2012 సెప్టెంబరు 21న ఆయన కన్నుమూశారు.

జన్మభూమి కోసం..

తాను పుట్టిన జన్మభూమి రుణం తీర్చుకునేందుకు 2010లో వాంకిడిలో 'లక్ష్మణ సేవాసదన్' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మహిళలకు కుట్టుశిక్షణ, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వాంకిడి మండల కేంద్రంలో తల్లిదండ్రుల స్మారకార్థం రెండు ముఖ ద్వారాలను నిర్మించారు.

ఇంధన్‌పల్లి రేంజిలో పెద్దపులి పాదముద్రల కలకలం



బురదలో కనిపిస్తున్న పులి పాదముద్ర

జన్నారం, న్యూస్‌టుడే: కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధి జన్నారం అటవీ డివిజన్ ఇంధన్‌పల్లి రేంజిలో పెద్దపులి పాదముద్రలు కలకలం రేపాయి. గురువారం చేపల వేటకు వెళ్లిన కొందరు ఆదివాసీ యువకులకు పులి పాదముద్రలు కనిపించడంతో చరవాణిలో ఈ చిత్రాలను బంధించారు. ఈ విషయమై ఇంధన్‌పల్లి రేంజి అధికారి హఫీసొద్దీన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పెద్దపులి సంచరిస్తోన్న మాట వాస్తవమేనని పశువులకాపరులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అయితే అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాకు పులి చిక్కకపోవడంతో సందిగ్ధం నెలకొంది. అటవీ డివిజన్‌లోని కొన్ని బీట్లలో పెద్దపులి సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ ఇటీవల దండోరా సైతం వేయించింది.

జైనథ్ ఆలయంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పూజలు



పూజలు చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. మహిళలు, నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, కంది మౌనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల పరుగు.. మారథాన్ వైపు

● అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ఆసక్తి

పరుగెత్తడం సులభమేమి కాదు.. చాలా మంది ఒకటి, రెండు కిలోమీటర్లు పరుగు పెట్టేందుకు ఆయాస పడుతుంటారు. అలాంటిది ఏకంగా 21(హాఫ్ మారథాన్), 42(మారథాన్) కిలోమీటర్లు నిర్విరామంగా పరుగెత్తడమంటే నిరంతర సాధన, పట్టుదలతో సాధ్యమవుతోంది. ఇలాంటి పరుగును అవలీలగా పూర్తి చేస్తున్నారు రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పోలీసులు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ అధికారి స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు పాల్గొంటూ మరింత మందికి ఆసక్తి పెంచుతున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం

ఎందరికో స్ఫూర్తి



రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా పనిచేస్తున్న కటికె రవిప్రసాద్ అందరికీ మారథాన్ రుచి చూపిస్తున్నారు. ఈయన ఇప్పటికే రెండు మారథన్‌లు, పదికిపైగా హాఫ్ మారథాన్‌లు పూర్తి చేసుకున్నారు. మొదట ఒక్కడిగా మొదలుపెట్టి ప్రస్తుతం పదుల సంఖ్యలో తోటి ఉద్యోగులతోపాటు స్నేహితులకు వ్యాప్తి చేశారు. రాష్ట్రంలో కాకుండా ముంబయి, గోవా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన మారథాన్‌కు హాజరయ్యారు. ఈ పరుగుతో మరికొంతమందికి స్ఫూర్తినిస్తూ తను ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఇతరులను వ్యాయామంపై ఆసక్తి పెంచుకునేలా చేస్తున్నారు.



ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ఔత్సాహికులు

హాఫ్ మారథాన్ అవలీలగా..



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఐగా పని చేస్తున్న గడిగొప్పుల సతీష్ హాఫ్ మారథాన్‌ను అవలీలగా చేసేస్తుంటారు. ఇటీవల తన మొదటి మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈయన 21 కిలోమీటర్లను మంచినీళ్లు తాగినంత సులువుగా పురుగెడతారు. దాదాపు 90-100 నిమిషాల వ్యవధిలో పూర్తి చేస్తారంటే ఏ స్థాయి వేగం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏడాదిన్నర సాధనలో పదులకొద్ది హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నారు. ఇంకా వేగాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.

నెమ్మదిగా ప్రారంభించి..




జిల్లా కేంద్రంలో ఇంటెలిజెన్స్ విభాగం ఎస్సైగా పనిచేస్తున్న రవికుమార్ ఏడాది కిందటి వరకు అయిదు కిలోమీటర్లే కష్టంగా పరుగెత్తేవారు. తోటి ఉద్యోగి స్ఫూర్తితో ఆఫ్ మారథన్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. గతేడాది సిద్దిపేటలో నిర్వహించిన మొదటి మారథన్‌లో భాగస్వాములయ్యారు. ఇది కాస్త ఇబ్బందిగా పూర్తి చేయగా ఆ తర్వాత హైదరాబాద్, కరీంనగర్‌లో జరిగిన మారథన్ అవలీలగా పూర్తి చేశారు. ప్రస్తుతం రెండు గంటల్లో 21 కిలోమీటర్లు పరుగెత్తుతుండగా మారథన్‌లోనూ భాగస్వామి అయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు.

నాలుగైదు నెలల్లోనే..



రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ తన మొదటి హాఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఇది వరకు 5, 6 కిలోమీటర్లకే పరిమితమయ్యేవారు. తోటి ఉద్యోగులు, మిత్రుల స్ఫూర్తి, ప్రోత్సాహంతో హాఫ్ మారథాన్‌వైపు అడుగులు వేశారు. కేవలం నాలుగైదు నెలల సాధనతో అవలీలగా పరుగుపెడుతున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు గంటల వ్యవధిలో పూర్తి చేస్తుండగా మరింత వేగం పెంచేందుకు సాధన చేస్తున్నారు.


ఏడాది నుంచి..



జిల్లాలోని భీమారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న బేతి రాములు ఏడాది నుంచి పరుగుపై దృష్టి పెట్టారు. హాఫ్ మారథాన్‌లో పాల్గొనాలనే ఆసక్తితో నిత్యం సాధన చేయడం ప్రారంభించారు. మొదట 5, 10, 15 ఇలా వడివడిగా కిలోమీటర్ల సంఖ్యను పెంచుకుంటూ ప్రస్తుతం 21 కిలోమీటర్లను అవలీలగా పరుగెత్తుతున్నారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తన తొలి హాఫ్ మారథాన్‌న్ విజయవంతంగా రెండు గంటల్లో పూర్తి చేసుకున్నారు. 42 కిలో మీటర్లను సైతం ఇదేతీరుతో పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలతో..





వీరిద్దరు రామగుండం కమిషనరేట్‌లో పరిధిలోని ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మాదాసి మధుకర్, రెడ్డిరాజుల తిరుపతి. ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటుంటారు. క్రమం తగ్గకుండా మైదానాన్ని వెళ్తుంటారు. పరుగు సాధన, అప్పుడప్పుడు ట్రెక్కింగ్ సైతం చేస్తుంటారు. తమ శాఖలోని అధికారులను స్ఫూర్తిగా తీసుకుని కొంతకాలంగా హాఫ్ మారథాన్‌కు సిద్ధమయ్యారు. కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మొదటిసారి హాజరై సునాయసంగా పూర్తిచేశారు. సాధనను కొనసాగిస్తూ మారథాన్‌కు సన్నద్ధమవుతామంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
జైనూరు : 63045 83192
రెబ్బెన : 80085 73643

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

బల్లార్ష, న్యూస్‌టుడే : వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్ జిల్లా భద్రావతి తాలూకా గోడ్‌పేట్‌కు చెందిన స్నేహితులైన భూషణ్ ఉమర్ గుండావార్(24), సతీష్ లోకండేలు బల్లార్‌పూర్‌లోని శివనగర్‌లో ఉంటున్న భూషణ్ సోదరిని కలిసేందుకు గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. కాగితపు మిల్లు నం.7వ గేటు వద్ద వెనుక నుంచి ఓ లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో భూషణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ సతీష్‌ను పోలీసులు బల్లార్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

హాజీపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వాంకిడి మండలం ఖిలాడీగూడకు చెందిన కోవ షేక్(38) మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. హాజీపూర్ పోలీసుల కథనం ప్రకారం వాంకిడి మండలం వెలిగి గ్రామానికి చెందిన ఆత్రం జ్యోతిరావు, కోవ షేక్‌లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వాంకిడి నుంచి ద్విచక్రవాహనంపై కొండగట్టుకు వెళ్తున్న క్రమంలో హాజీపూర్ మండల కేంద్రంలో ఎదురుగా లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు కంకర లోడుతో వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జ్యోతిరావు అక్కడికక్కడే మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కోవ షేక్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సీతాబాయి ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి.. లోయలోకి దూసుకెళ్లి

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని ఆడెపెల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో బుధవారం రాత్రి ఆటో అదుపుతప్పి లోయలో పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన సాయి తన ఆటోలో బుధవారం రాత్రి బెజ్జూరు మండలం మర్దిడి గ్రామంలోని తన అత్తగారి ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో వేగంగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో ఆటో లోయలోకి వెళ్లింది. వెంటనే బయటకు దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.


ఆటోను బయటకు తీస్తున్న స్థానికులు

అడవి పంది దాడిలో మహిళకు గాయాలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : మండలంలోని బోడపల్లి గ్రామానికి చెందిన ఎల్లు కమలపై గురువారం సాయంత్రం అడవి పంది దాడి చేసిందని కుటుంబీకులు తెలిపారు. కమల తన కుటుంబసభ్యులతో కలిసి పత్తి చేనులో కలుపు తీస్తున్న క్రమంలో అడవి పంది ఆమెపై దాడి చేసింది. కేకలు వేయడంతో కొద్దిదూరంలో ఉన్న కుమారుడు పరుగు తీయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఎడమ చేతికి తీవ్ర గాయం కావడంతో పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అక్రిడేషన్ కాలపరిమితి పొడిగింపు

ఆసిఫాబాద్ అర్బన్: వర్కింగ్ జర్నలిస్టులకు ఇచ్చిన అక్రిడేషన్ కార్డు కాల పరిమితిని మూడు నెలల పాటు పొడిగించింది. సెప్టెంబరు 30 నుంచి డిసెంబరు 31 వరకు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం తెలిపారు.

చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం


ధోబీఘాట్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికీ ఆదర్శనీయమని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల అన్నారు. గురువారం జయంతి పురస్కరించుకుని పట్టణంలోని ద్వారకానగర్‌లోని ధోబీఘాట్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సైతం ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జడ్పీ మాజీ ఛైర్మన్ సిడాం గణపతి, నాయకులు శరత్‌ముదిరాజ్, షబ్బీర్‌హుస్సేన్, రజక సంఘం నాయకులు ఎల్లయ్య, లచ్చయ్య, శంకరయ్య, నంబులు, రాజేష్, రాజు, వెంకటేష్, కరుణాకర్, అనీల్, శ్రీనివాస్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. భారాస ఆధ్వర్యంలో కోసినిలోని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాసంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. లెండుగురె శ్యాంరావు, సయ్యద్ మోయినోద్దీన్, నక్క మనోహర్, సలీం, శోభన్, కన్నయ్య, అంజన్న, రమాదేవి పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సతీష్ వేడుకలు నిర్వహించారు.

కౌటాల : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో.. ఎమ్మెల్సీ దండె విఠల్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, నాయకులు రవీందర్‌గౌడ్, సుల్తాన్ ఉమామహేష్, డబ్బు గోపాల్, నయీం అహ్మద్, తిరుపతి పాల్గొన్నారు.

బెజ్జూరు: రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో.. వెంకటేష్, శ్రీనివాస్, రాకేష్, రవి, కార్తిక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు తిరుపతి, నాయకులు జావిద్, చంద్రశేఖర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య, ఉపన్యాసకులు సురేంద్రకుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సంతోష్, సత్యం, శ్రీకాంత్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అర్బన్: చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐలు సతీష్, రాణాప్రతాప్, కేశవులు, ఆర్ఐలు పెద్దయ్య, అంజన్న, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



వాంకిడి కళాశాలలో..


బెజ్జూరులో.. రజక సంఘం నాయకులు

ఈనాడు స్పందనకు వందనం

గుంత పూడ్చివేత

కౌటాల, న్యూస్‌టుడే : మండలంలోని గుండాయిపేట గ్రామంలో అంతర్గత రహదారి అధ్వానంగా మారడంతో గురువారం 'ఈనాడు'లో 'రహదారి ఇలా.. నడిచేదెలా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి తిరుపతి స్పందించారు. సిబ్బందితో గుంతను పూడ్చివేయించారు.

పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఆధునిక సమాజంలో పర్యాటక రంగానికి ప్రాముఖ్యత పెరుగుతోందని, ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీదేవి సూచించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో త్రిశూల్‌పహాడ్‌పై ఉన్న ఆలయ సముదాయాలను గురువారం విద్యార్థులతో కలిసి సందర్శించారు. త్రిశూల్ పహాడ్‌ను పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ఏర్పాటు చేయాల్సిన వసతులను విద్యార్థులతో నమోదు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. దేశంలోని వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించి అవగాహన పెంచుకోవాలని వైస్ ప్రిన్సిపల్ డా.లక్ష్మీనరసింహం పేర్కొన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందడం వల్ల యువతకు అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. యువ టూరిజం క్లబ్ కో-ఆర్డినేటర్ డా.వి.దేవేందర్‌రెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు మహా లక్ష్మయ్య, శారద, రజిత, పాల్గొన్నారు.



త్రిశూల్‌పహాడ్‌పై విద్యార్థులతో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : సిర్పూర్(టి) మండలం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ.. గురువారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో ఏళ్ల నుంచి సుమారు 2500 ఎకరాలు సాగు చేసుకుంటున్నామన్నారు. ఏటా అధికారులు అటవీ భూమి అంటూ తమను సాగుచేయనివ్వడం లేదని వాపోయారు. ప్రస్తుతం 400 ఎకరాలు మాత్రమే ఉన్నాయని, భవిష్యత్తులో వీటిని సైతం తీసుకునే ఆస్కారం ఉందని ఆరోపించారు. తమకు వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలతోపాటు వ్యవసాయ భూములు కేటాయించాలని విన్నవించారు.


సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లతో మాట్లాడుతున్న రైతులు

గిరిజన చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : గిరిజన ప్రాంతంలోని 1/70, పీసా చట్టాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఈవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఏజెన్సీ పంచాయతీల కార్యదర్శులకు గిరిజన ప్రాంతంలో 5వ షెడ్యూలు, ఏజెన్సీ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అవగాహనతో అమలు పరిచేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. భూచట్టాలు, పీసా చట్టాల ఉల్లంఘన జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి ఎంఏ ఆదిల్ ఏజెన్సీ, పీసా చట్టాల్లోని పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కోలిండియా స్థాయిలో సత్తాచాటాలి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: క్రీడాకారులు సత్తాచాటి కోలిండియాలో సింగరేణికి పతకాలు తీసుకురావాలని బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఏఎన్ఎస్ రాధాకృష్ణ ఆకాంక్షించారు. గురువారం బెల్లంపల్లిలోని టీసీఓఏ క్లబ్‌లో ఏరియా డిపార్టుమెంటల్ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాకారులను పరిచయడం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు నిత్యం సాధన ద్వారా క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. క్రీడానైపుణ్యత ప్రదర్శించి బెల్లంపల్లి ఏరియాకు పేరు తీసుకురావాలని సూచించారు. గతంలో కోలిండియా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఏరియా డబ్ల్యూపీఎస్ కో-ఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకుడు శ్రీధర్ పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఏఎన్ఎస్ రాధాకృష్ణ

దీపావళి బోనస్ రూ.లక్ష సాధించాలని డిమాండ్

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: కోలిండియా యాజమాన్యంతో ఈ నెల 29న జరిగే స్టాండర్డ్ కమిటీ సమావేశంలో జాతీయ సంఘాలు సింగరేణి ఉద్యోగులకు రూ.లక్ష దీపావళి బోనస్ ఇప్పించే విధంగా కృషి చేయాలని తెబొగకాసం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. గురువారం గోలేటిలోని సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అయిదేళ్ల నుంచి రూ.5 లేదా రూ.6 వేలు మాత్రమే పెంచుతూ గతేడాది రూ.85,000 మాత్రమే ఇచ్చారన్నారు. ఈసారి పెరిగిన ధరలకు అనుగుణంగా బోనస్ పెంచి రూ.లక్షకు తగ్గకుండా దీపావళి బోనస్ ఇప్పించాలన్నారు. సంఘం బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కేంద్ర కమిటీ సభ్యుడు మాంతు సమ్మయ్య పాల్గొన్నారు.

బల్దియా కార్మికులకు వైద్యశిబిరం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా. . గురువారం సిర్పూర్ పేపర్ మిల్లు, స్పర్శ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బల్దియాలోని కార్మికులు, ఉద్యోగులకు వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ మేనేజర్ పెద్దింటి క్రాంతి, డీఈ రమాదేవి, పర్యావరణ ఇంజినీర్ ప్రణీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.శంకర్, ఎస్పీఎం సీఎస్ఆర్ యూనిట్ మేనేజర్ రీనా బిల్వాల్, ప్రాజెక్టు అధికారి సుందరం, ఎస్పీఎం వైద్య బృందం పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వాంకిడి, న్యూస్‌టుడే: మండల విద్యాధికారిగా శివచరణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు మానుకుమార్ ఇన్‌ఛార్జి ఎంఈఓగా పనిచేయగా.. ఇందాని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివచరణ్ కుమార్‌కు పూర్తి బాధ్యతలు అప్పజెప్పింది. పీఆర్టీయూ సంఘం నాయకులు, ఎమ్మార్సీ సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల సిబ్బంది ఆయనను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నటరాజ్, ప్రమోద్‌కుమార్, ఉప్రె వినేష్, జగదీష్, శ్రీనివాస్, దుర్గయ్య, సీఆర్పీలు సునీల్, సందీప్, ఆపరేటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.



ఎంఈఓ శివచరణ్ కుమార్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు, ప్రధానోపాధ్యాయులు


బెజ్జూరు : సునీత


రెబ్బెన: వెంకటేశ్వర్

బెజ్జూరు: బెజ్జూరు ఎంఈఓగా ఘనకోట్ సునీత గురువారం బాధ్యతలను స్వీకరించారు. బెజ్జూరు జడ్పీ సెకండరీ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసే ఆమెకు బాధ్యతలను అప్పగించారు. ఆమెతోపాటు ఇదివరకు ఇన్‌ఛార్జి ఎంఈఓగా పనిచేసిన రమేష్‌బాబును ఉపాధ్యాయులు సన్మానించారు.

రెబ్బెన: రెబ్బెన ఎంఈఓగా గురువారం మెకార్తి వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టారు. కాసిపేట మండల ఎంఈవో వెంకటేశ్వరస్వామి, మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, సీసీవో ఆయనను శాలువాతో సన్మానించారు.


కాగజ్‌నగర్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

27న విద్యార్థి మహాగర్జన

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న విద్యార్థి మహాగర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని.. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలే సాయికృష్ణ కోరారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆరేళ్లుగా బోధనా రుసుములు పెండింగ్‌లో ఉన్నాయని, సంక్షేమ వసతిగృహాల్లో మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచడంలేదని ఆరోపించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ నితీష్, చటారే భీంరావు, ఆకాష్, గణేష్, సాయి, కార్తీక్, రక్షిత, చిత్తరంజన్, తేజస్విని, పూజ, ఝాన్సీ రాణి, అనూష తదితరులున్నారు.

పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్ సందర్శన

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని పలు దస్త్రాలను పరిశీలించారు.

సంక్షిప్తం

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా : ఎమ్మెల్సీ

కౌటాల: బండపాటి శివారులో ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు హక్కుపత్రాలు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం తలోడి గ్రామంలో ఆయన పర్యటించగా.. రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. హక్కు పత్రాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

28న మహాధర్నా

కాగజ్‌నగర్: రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్, గురుకుల జేఏసీ సంయుక్తంగా ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని.. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి కోరారు. కాగజ్‌నగర్‌లో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల పనివేళలు ఒకేలా ఉండాలని, మెస్‌ఛార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లించాలని కోరారు. గురుకుల ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు మంజూరు చేస్తూ నగదు రహిత వైద్యం అందుబాటులోకి తేవాలని, 317 జీవోతో స్థానికత కోల్పోయిన వారిని సొంత జోన్లకు పంపించాలని పేర్కొన్నారు.

నల్లబ్యాడ్జీలతో పంచాయతీ కార్యదర్శుల నిరసన

దహెగాం: ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండలాధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా మిత్రులకు మద్దతుగా సంఘీభావం తెలిపామన్నారు. నల్గొండ జిల్లా పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటూ జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి: ఎస్పీ

ఆసిఫాబాద్: జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి విధిగా తీసుకోవాలని ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. డీఎస్పీ ఆపై స్థాయి పోలీసు అధికారుల అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కల్గించేందుకు దారితీసే సమావేశాలు నిషేధమన్నారు. సామాజిక మాధ్యమాల్లో అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కథల పుస్తకాలు పిల్లలకు ఉపయోగకరం

రెబ్బెన: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూపొందించిన ప్రతులను ఎంఈఓ మెకార్తి వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. తెలుగు కథల పుస్తకాలు, స్టోరీ కార్డ్స్‌ను ఉపాధ్యాయులకు అందజేసి మాట్లాడారు. అయిదు రకాల కథల పోస్టర్లు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక అక్షరాస్యత అంశాలు, పఠన కృత్యాలు, పుస్తక సంరక్షణ, గ్రంథాలయ, పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లే నియమాలు ఉన్నాయని తెలిపారు.

'యూడైస్ ప్లస్'లో తప్పుడు సమాచారం ఇవ్వొద్దు

కెరమెరి: పకడ్బందీగా యూడైస్ ప్లస్ ఫారాలు నింపాలని ఎంఈవో ఆడే ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో యూడైస్ ప్లస్‌పై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు సంబంధించిన భవనం, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను నింపాలన్నారు. తప్పుగా సమాచారం అందిస్తే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల్లో నింపిన ఫారాలను ఎంఆర్సీకి అందించాలని సూచించారు.

పార్ట్‌టైం ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలి

దహెగాం: పార్ట్‌టైం ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. కేజీబీవీ, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లోని సీఆర్టీలకు మినిమం టైం స్కేలు వర్తింపజేయాలన్నారు. పండగ సమీపిస్తున్నా సీఆర్టీలకు వేతనాలు లేక అవస్థలు పడుతున్నారని వాపోయారు.

పోషకాహార లోపాలున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి


ఆసిఫాబాద్ అర్బన్, సిర్పూర్(టి): ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా పోషకాహార లోపమున్న పిల్లల్ని గుర్తించాలని జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో, సిర్పూర్(టి) మండలంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహారంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు.

జైనూర్ ఘటనలో పోలీసుల వైఫల్యం

ఖైరతాబాద్: జైనూర్ ఘటన ప్రజల మధ్య విద్వేషాలు కలిగించేదిగా ఉందని పలువురు సామాజిక కార్యకర్తలు ఆరోపించారు. పోలీసుల వైఫల్యం కనిపిస్తోందని ప్రొ.పద్మజాషా అన్నారు. పలువురు సామాజిక కార్యకర్తలతో ఈ నెల 14, 19వ అక్కడ పర్యటించామని తెలిపారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. గిరిజన మహిళ కుటుంబంలో జరిగిన గొడవను హిందూ, ముస్లిం వివాదంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. పీఓడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ.. జైలూర్‌లో భాజపా, ఆర్ఎస్ కారణంగా అభద్రతాభావం నెలకొందన్నారు. ఘటనకు ప్రభుత్వం, భాజపా బాధ్యత వహించాలన్నారు. సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

'ప్రశస్త' అమలుపై అవగాహన

వాంకిడి, కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించడానికి ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్‌లో వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్, వాంకిడి ఎంఈఓ శివచరణ్‌కుమార్ పేర్కొన్నారు. వాంకిడి, కాగజ్‌నగర్‌లోని డీఆర్సీ కార్యాలయంలో యాప్‌పై గురువారం నిర్వహించిన ముగింపు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్‌ను కేవలం స్క్రీనింగ్ టూల్‌గా ఉపయోగించాలని, అన్ని తరగతుల విద్యార్థులను నిశితంగా పరిశీలించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులతో చర్చించి విద్యార్థుల స్క్రీనింగ్ సరిగా జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. అక్టోబర్ 26 నాటికి యాప్‌లో ప్రతి విద్యార్థికి కేటాయించిన 64 ప్రశ్నలను పూర్తి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ప్రబోధ్, నటరాజ్, ఐఈఆర్పీలు తిరుమల, మౌనిక, సతీష్, రిసోర్స్ పర్సన్ సుశీల్‌కుమార్, పుల్లూరి బాలకృష్ణ, సీఆర్పీలు సందీప్, సునీల్, విజయ్‌బాబు, సీసీఓ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ శివచరణ్ కుమార్

శ్రమదానం చేసి.. మొక్కలు నాటి

రెబ్బెన, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిశుభ్రత పాటించాలని డీఆర్‌డీవో దత్తారామ్ అన్నారు. దేశవ్యాప్త 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా.. గురువారం రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆయన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని ఏరివేశారు. అనంతరం మొక్కలు నాటి మాట్లాడారు. కళాశాల ఆవరణతోపాటు నివాస ప్రాంతాల్లో చెత్త నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. గ్రామాల్లో స్వచ్ఛతపై విద్యార్థులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీవో వాసుదేవ్ ప్రిన్సిపల్ అతియ ఖానం, ఎస్‌బీఎం జిల్లా కో-ఆర్డినేటర్ ఫణికుమార్, ఏంఐఎస్ సాయి, పంచాయతీ కార్యదర్శి నమృత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎస్పీఎం నుంచి వచ్చే కాలుష్యం కారణంగా పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యాజమాన్యం వెంటనే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని భారాస నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మిల్లు నుంచి వెలువడే వ్యర్థాలతో వ్యవసాయ భూములు పాడవుతున్నాయన్నారు. ధూళి కారణంగా ప్రజలకు కంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. భారాస ప్రభుత్వం మిల్లు యాజమాన్యానికి రాయితీలు ఇస్తే స్థానికేతరులకు ఉద్యోగాలిచ్చి, స్థానికులను రోగాలకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. సయ్యద్ మోయినోద్దిన్, నక్క మనోహర్, సలీం, శోభన్, కన్నయ్య, అంజన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న గిసంశా అధికారి రమాదేవి

తనిఖీ చేసి.. ఆదేశాలు జారీచేసి

తిర్యాణి, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆహార పట్టిక ప్రకారం భోజనం అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ (గిసంశా) అధికారి రమాదేవి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. తిర్యాణి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. సూంగపూర్ శాటిలైట్ పాఠశాలలో శుద్ధజల యంత్రం మరమ్మతులు చేయించి శుద్ధజలం అందించాలని హెచ్ఎంను ఆదేశించారు. గిన్నెధరి ఆశ్రమ పాఠశాల తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబు రాబట్టారు. హాజరు పట్టికలు, సరకుల నిల్వల దస్త్రాలను తనిఖీ చేశారు.

★ తిర్యాణి రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి, వారికి పౌష్టికాహారం అందించే విధానంపై అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలను అవగాహన సదస్సు నిర్వహించారు. గిసంశా అధికారి మాట్లాడుతూ.. 18 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలను నమోదు చేసుకుని వారిలో బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించాలన్నారు. బాలామృతం ప్లస్ అందించాలని ప్రతివారం పిల్లల బరువు తూకం వేయాలని ఆదేశించారు. సీడీపీవో తిరుపతమ్మ, ఎంపీడీవో మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.